Office : 9440815774

మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

వ్యవస్థాపకులు : డి.విజయ్‌కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : తిరుపతి - చిత్తూరు | సంపుటి : 02 | సంచిక : 265 | ఎడిటర్ : కే ఎల్ కృష్ణంరాజు | శనివారం 10 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 2

## தமிழ்நாடு காவல் துறை அறிவிப்பு

கெலமங்கலம் காவல் நிலைய குற்ற எண்.13/2007, 450,395, & 395 IPC

SC.No.98/2010 சார்பு நீதிமன்றம் தேன்கனிக்கோட்டை.

தலைமறைவு எதிரி : A3
பெத்தட்டிகள்ள ராமு (எ) ஆனந்த்
த.பெ. பெத்தவெங்கடேஷ்வரலு
கீழ்மரதேப்பள்ளி கிராமம்
சின்னசவுக்கு அஞ்சல்
கடப்பா மாவட்டம்
ஆந்திரா மாநிலம்.

மேற்படி வழக்கு சம்மந்தமாக நீங்கள் நீதிமன்றத்தில் ஆஜராகாததால் உங்கள் மீது பிடி ஆணை பிறப்பிக்கப்பட்டது. கடந்த 2014ம் வருடம் முதல் நீங்கள் தலைமறைவாக இருந்து வருகிறீர்கள். ஆகையால் நீங்கள் வருகின்ற 26-10-2026ம் தேதி காலை 10.00 மணிக்கு தேன்கனிக்கோட்டை சார்பு நீதிமன்ற நீதியரசர் அவர்கள் முன்பாக ஆஜராகும்படி அறிவுறுத்தப்படுகிறது. மீறும் பட்சத்தில் உங்கள் சொத்தின் மீதி கடுமையான நடவடிக்கை எடுக்கப்படும்.

## తమిళనాడు పోలీసు ప్రకటన



కెలమంగలం పోలీసు స్టేషన్ క్రైమ్ నెంబర్ 13/2007,450, 395 IPC

SC.No.98/2010, సబ్ కోర్టు, డెంకణికోట

కనబడని శత్రువు : A3
పెద్దట్టికళ్ల రాము (అనే) అనంద్
తండ్రి పేరు : పెద్దవెంకటేశ్వరులు
కిందమరదేపల్లి (కిల్‌మరదేపల్లి) గ్రామం
చిన్నచావుకు పోస్టు, కడప జిల్లా,
ఆంధ్రా రాష్ట్రం.

పై వున్న కోర్టులో హాజరుకానందు వల్ల మీ పై కేసు విచారణ జరిగింది. గత 2014 సంవత్సరము నుండి మీరు తలమానికంగా (కనబడుకుండ) ఉన్నారు. కావున మీరు 26-10-2026 తేది ఉదయం 10.00 గంటలకు డెంకణికోట అసిసెంట్ సెష్షన్ జడ్జి వారి ముందు హాజరుకావాలని సూచించారు. ఓక వేళ హాజరుకానిచో మీ సొత్తు (ఆస్తులు) మీద తీవ్రమైన చర్యలు తీసుకోబడుతుంది.

## TAMILNADU POLICE

KELAMANGALAM POLICE STATION CR.NO.13/2007/450/395 & 395 R/W 397 IPC

SC.No.98/2010, SUB COURT DENKANIKOTTAI.

ACCUSED : A3
PETHATIKALLAN RAMU @ ANNAND (40)
S/o. Petha Venkateshvaralu
Keelmaratheypalli Village
Chinna Chvuka Post, Kadapa Dt. Andra Pradesh State.

An Arrest Warrant has been issued against you for not appearing in court in connection with the above case. You have been absconding since 2014 Year . Therefore, you are advised to appear before them at 10.00 am on 26-10-2026 at Denkanikottai. In Case of Violation, Strict action will be taken against the rest of your property.

| Inspector Of Police | Sub Inspector of Police | Police Station |
|---|---|---|
| 94981 70004 | 8760458198 | 94981 01109 |

# స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

- వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్
- హైకోర్టు ఇచ్చిన 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది.
- సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం
- వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యా



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "సర్" ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే నోటిఫికేషన్ విడుదలలోపు సర్ ప్రక్రియ పూర్తైతే ఆ జాబితానే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీకి - మిగతా3లో

## వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యానికే మేము వ్యతిరేకం

- మోదీ సర్కార్‌పై రాహుల్, ఖర్గే తీవ్ర విమర్శలు
- ప్రతి వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు ఉండాలి
- రాజకీయ మద్దతుతో సాగే పెట్టుబడిదారీ విధానానికి చరమగీతం పాడాలి



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు:
- నర్సింగోలులో చంద్రబాబు ప్రసంగం
- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై - మిగతా3లో

## "ఓట్ల దొంగతనం" జరుగుతోంది

- "ఓట్ల దొంగతనం"పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విపక్షాలు
- ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి కోరినట్లు వెల్లడించిన రాహుల్
- ప్రధాని, హోంమంత్రి, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపణ
- సీఈసీ రాజీనామా చేయాలని, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని డిమాండ్
- సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన విపక్ష కూటమి





## నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

- నీట్ పరీక్ష నిర్వహణలో కీలక మార్పులు చేయాలి
- పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కీలక సిఫార్సులు చేసింది.
- ఇక్కడ ఎన్టీఏ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థ

### వెలిగొండ పూర్తి ఫలాలు

## అందించేందుకు అడుగులు

- రూ.2,847 కోట్లు ఇస్తే రెండు దశల్లోనూ నీళ్లు
- రూ.941 కోట్లతో తొలిదశ ఆయకట్టుకు నీరు
- తదుపరి పనులపై దృష్టి సారిస్తోంది.
- రూ.14,432 కోట్లకు అంచనాల సవరణ.
- జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును వేసవి కాలం నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో అడుగులు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్ల పూర్తి చేసి, నల్లమలసాగర్ జలాశయంలో దాదాపు 7 టీఎంసీల నీళ్ల ప్రభుత్వం నింపింది. ఇప్పుడు తదుపరి పనులపైనా దృష్టి సారిస్తోంది. వీటిని పూర్తి చేసేందుకు మరో రూ.2,847 కోట్లు అవసరమని ప్రాథమికంగా లెక్కలు - మిగతా3లో

## జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

- అందుకే ఢిల్లీని కోటలా'- నిరసనల వేళ సీజేపీ విమర్శలు
- రాజధానిలో ఇంటర్నెట్ బంద్!
- సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సీజేపీ భారీ నిరసనలకు సిద్ధమైంది. తమకు భయపడి కేంద్రం ఆంక్షలు విధిస్తోందని ఆరోపించింది.
- మెట్రో, రైళ్లపై ఆంక్షలు- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



## కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో

# శరన్నవరాత్రి సందడి.. వైభవంగా పత్రికా పూజ

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**
కుప్పం పట్టణంలోని శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానంలో ఈ నెల11 నుంచి 20వ తేదీవరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి(దసరా)పూజామహోత్సవా లకు శుక్రవారం పత్రికా పూజ నిర్వహించారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచెర్ల శ్రీకాంత్, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి కనగాన శ్రీకాంత్, ఆలయ చైర్మన్ బి.ఎం.కె. రవిచంద్రబాబు, బోర్డు సభ్యులు జయరాం నాయుడు, లక్ష్మీ ఆనంద్, కందస్వామి, శరవణ, పవన్ మహేష్, వేణుగోపాల్, కె. లోకేష్ బాబు, బిల్డింగ్ సొసైటీ వైస్ చైర్మన్ గిరిధర్, రాజా, వెంకటేష్ తదితరులు పూజలో పాల్గొని ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకోవాలని, తమ శక్తి మేరకు ధన, ధాన్య, వస్తు రూపాల్లో విరాళాలు అందించి ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన




**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 09:**
ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వెదురుకుప్పం మండలం దేవలంపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఈ. చామంతి విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, భావోద్వేగాల నియంత్రణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని, ఆరోగ్యకరమైన మనస్సుతో చదువులోనూ, జీవితంలోనూ అభివృద్ధి సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. చంద్రనాయక్, ఎస్ఎంసీ చైర్మన్ పి. శేషాద్రి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపుపై

# విద్యార్థి సంఘాల నిరసన

### చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్



**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ పేరుతో 13.3 కోట్ల ఓట్లు తొలగించారంటూ పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హిందూపురం అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాబావలి, నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఓట్ల తొలగింపు పేదలు, విద్యార్థులు,వలస కార్మికుల రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కుకు భంగం కలిగిస్తోందని ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఛలో లోక్‌భవన్ కార్యక్రమంలో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కమల్ భాష,బద్రీనాథ్, అనుదీప్, దేవా తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా

# బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తా

**పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తా**
**జనసేన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపిన తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త**

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**



శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ సంస్థాగత బలోపేతానికి పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా తనకు కీలక బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు సదరు సమన్వయకర్త హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అధినేత తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, ప్రజల పక్షాన జనసేన పార్టీ గొంతుకను మరింత బలంగా వినిపిస్తానని తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా స్థానిక నాయకులు, జనసైనికులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మానసిక ఆరోగ్యమే పునాది!










- **విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనలపై అవగాహన**
- **రాళ్లబూదుగురు పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమం**
- **ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కడ పిడి వికాస్ మర్మత్**

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
విద్యార్థుల భవిష్యత్తు విజయవంతం కావాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం రాళ్లబూదుగురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం మైండ్ అండ్ వెల్నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు, కడపిడి వికాస్ మర్మత్, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరిస్తూ, చదువులో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. పరీక్షల సమయంలో ఆందోళనకు గురికాకుండా, సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థి దశలో అలవర్చుకునే క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు.

**మనసులోని భావాలను పంచుకోవడం బలహీనత కాదు**

విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను మనసులోనే దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. అవసరమైనప్పుడు ఇతరుల సహాయం కోరడం బలహీనత కాదని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ పరిష్కార మార్గాలను అన్వేషించడం నిజమైన ఆత్మబలానికి నిదర్శనమని వివరించారు. తగిన విశ్రాంతి, వ్యాయామం, ఆటలు, సమయపాలనతో పాటు ఆరోగ్యకరమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు.

**విద్యార్థుల మానసిక వికాసానికి ప్రత్యేక ప్రాధాన్యత**

విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు సంకల్పం మైండ్ అండ్ వెల్నెస్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాన్ని ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థుల భావోద్వేగాలను అర్థం చేసుకుని, వారికి తగిన ప్రోత్సాహం అందించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. మానసికంగా దృఢంగా ఉండే విద్యార్థులు చదువులోనే కాకుండా జీవితంలోని సవాళ్లను కూడా సమర్థంగా ఎదుర్కోగలరని తెలిపారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడం, ఒత్తిడిని అధిగమించే సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల మానసిక వికాసానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు.

## దివ్యాంగ చిన్నారుల మధ్య కుమార్తె జన్మదిన వేడుకలు



**గంగవరం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
పలమనేరు నియోజకవర్గ వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు ప్రభాకర్ తన రెండో కుమార్తె యోచిత జన్మదిన వేడుకలను శుక్రవారం వినూత్నంగా నిర్వహించారు. గంగవరం మండలం నడింపల్లి గ్రామ సమీపంలోని రిమ్స్ మానసిక దివ్యాంగుల శిక్షణ వసతి గృహంలో చిన్నారులకు అల్పాహారం ఏర్పాటు చేసి, వారి మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు చిన్నారి యోచితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, గంగవరం మండల పార్టీ అధ్యక్షుడు సోమశేఖర్ గౌడ్, ప్రతాప్ కుమార్ రెడ్డి, సురేష్ చౌదరి, బాలాజీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదాన శిబిరం

**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్ 09:**



హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కోనేటి స్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. కృష్ణమూర్తి నాయుడు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. హిందూపురం బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి విద్యార్థులకు రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, రక్తదానంపై ఉన్న అపోహలను శాస్త్రీయంగా నివృత్తి చేశారు. రక్తదానంపై విద్యార్థులు చూపిన ఆసక్తిని అభినందించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్లు సాయి తేజ, ఆంజనేయులు, వీరాంజనేయులు పాల్గొశ్రీ చైతన్య పాఠశాలలో వైభవంగా ముందస్తు దసరా వేడుకలు

## నవదుర్గల వేషధారణలో అలరించిన విద్యార్థులు




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయాలకు ప్రతీకగా పాఠశాల ఆవరణలో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి, పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులతో దుర్గాదేవి శ్లోకాలను భక్తిపూర్వకంగా ఆలపింపజేశారు. నవదుర్గల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు నవదుర్గల తొమ్మిది అవతారాల విశిష్టతను, వాటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తోటి విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. సంప్రదాయాలు,ఆధ్యాత్మిక విలువల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేలా వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ,దసరాపండుగ కేవలం వేడుక మాత్రమే కాదని, మనలో ని చెడు లక్షణాలను జయించి మంచి గుణాలను అలవరచుకోవాలని చాటి చెప్పే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. కోపం,అహంకారం,అసూయ, ద్వేషం వంటి ప్రతికూల భావాలపై విజయం సాధించినప్పుడే నిజమైన వ్యక్తిత్వ వికాసం సాధ్యమవు తుందని విద్యార్థు లకు సూచించారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ..., ఇతరులను ఓడించడం లో నిజమైన విజయం లేదని,మనలోని బలహీనతల ను అధిగమించడమే అసలైన విజయమని పేర్కొన్నారు. దసరా పండుగ అందించే సందేశాన్ని ప్రతి విద్యార్థి జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్లు లావణ్య, అమ్మాజీ, ఇన్‌చార్జులు కల్పన,వాసంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.న్నారు.

# బీసీలకు 34 శాతం స్థానాలు కేటాయిస్తాం

### టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు తెలుగు దేశం పార్టీ కట్టుబడి ఉందని, రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పార్టీ పరంగా 34 శాతం స్థానాలను బీసీలకు కేటాయిస్తామని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్ రావు తెలిపారు.బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. బీసీలకు దక్కాల్సిన రాజకీయ అవకాశాలను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. గతంలో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం వల్ల వేలాది రాజకీయ పదవులు బీసీలకు దూరమయ్యాయని ఆరోపించారు.బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వారికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించేందుకు టీడీపీ నిరంతరం కృషి చేస్తుందని ఉమేష్ రావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీమాల భాస్కర్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి, గంగనపల్లి రమేష్, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

### నూతన డీఎస్పీ పావనికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అభినందనలు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**



శ్రీకాళహస్తి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచించారు. శ్రీకాళహస్తి నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. పావని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు అభినందనలు తెలియజేసి, నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలో శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణ, స్థానిక సమస్యలపై డీఎస్పీతో చర్చించారు. మహిళలు, వృద్ధులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజల కు భద్రత కల్పించేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల భద్రతే పోలీసు శాఖకు ప్రథమ ప్రాధాన్యత కావాలని, శాంతిభద్రతల విషయంలో రాజీ పడకుండా ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేలా స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగి స్తూ, ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆకాంక్షించారు.

# కార్యకర్తలకు గుర్తింపు కార్డులతో పార్టీ బలోపేతం

## మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

**పెనుకొండ, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**



పరిగి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ శుక్రవారం పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. బీచగానిపల్లి, శిగుపల్లి, పైడేటి, పి.నరసాపురం, శిరేకొలం, వనంపల్లి, ఎర్రగుంట పంచాయతీల కార్యకర్తలకు కార్డులు అందజేశారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-మొదటిపేజీ తరువాయి

ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంద్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో




పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు.
ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

**నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి**

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# సీట్ల సర్దుబాటు ఎలా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు-పవన్‌ల భేటీలు, పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాత జనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో జనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది. అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి-ఫామ్




రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగా మార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములను శాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీ ఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది. పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు-పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయ శ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

## ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ :** ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు.

## స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

సూచించింది. సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. . ఇబ్బంది పడేవారికి లేని బాధ మీకెందుకని వైఎస్సార్సీపీ లాయర్?ను కోర్టు నిలదీసింది. ఎన్యూమరేటర్లు, ప్రభుత్వం, కేంద్రం ఎవరికీ లేని నొప్పి మీకెందుకని ప్రశ్నించింది. బీసీ రిజర్వేషన్ల కేసు కొట్టివేత: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక అమలు చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఎక్కడ ఉందని జస్టిస్ దీపాంకర్‌దత్త ధర్మాసనం ప్రశ్నించింది. నివేదిక ఆధారంగా ఫ్యామిలీ డేటాను పరిగణనలోకి తీసుకుంటారని ధర్మాసనం వ్యాఖ్యానించగా, నివేదిక ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ వివరించారు. ఫ్యామిలీ డేటాను డెడికేటెడ్ కమిషన్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. నివేదిక ఆమోదం లేకుండా డేటా తీసుకోవడంలో హైకోర్టు కారణం సరిగానే ఉందన్న సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

-మొదటిపేజీ తరువాయి

రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## వెలిగొండ పూర్తి ఫలాలు అందించేందుకు అడుగులు

-మొదటిపేజీ తరువాయి

వేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రూ.9,081.30 కోట్లకు ఉన్న అంచనా వ్యయాన్ని తాజా పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సి ఉంది. ప్రాజెక్టు మొత్తం వ్యయాన్ని రూ.14,432 కోట్లకు సవరించేలా ప్రతిపాదనలతో వెలిగొండ ప్రాజెక్టు అధికారులు చీఫ్ ఇంజినీర్ల కమిటీకి నివేదిక సమర్పించారు. కమిటీ పరిశీలన అనంతరం ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిస్తారు. రెండో దశలో ఉమ్మడి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని 3,28,300 ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చేలా పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**రూ.941 కోట్లతో తొలిదశ ఆయకట్టుకు నీరు**

వెలిగొండ నుంచి నల్లమలసాగర్ జలాశయానికి ఇప్పటికే కొంతమేర నీరు తరలించారు. జలజీవన్ మిషన్ పథకం? కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును వేసవి కాలం నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు.
తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు, మైనర్లు, ఫీల్డ్ ఛానళ్లు ఏర్పాటు చేయాలి. నల్లమలసాగర్ నుంచి తీగలేరు కాలువ, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ నీళ్లు తీసుకెళతాయి. ఇందులో తీగలేరు కాలువ 48.30 కిలోమీటర్లకు గాను ఇంకో అర కిలో మీటర్ మేర తవ్వాల్సి ఉంది. కాలువపై 72 కట్టడాలకు 40 నిర్మాణాలు పూర్తయ్యాయి. 62,000 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే ఈ కాలువ నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీల ఏర్పాటుకు 424.53 ఎకరాలు సేకరించాల్సి ఉంది. గొట్టిపడియ కాలువ నిర్మాణం 11.40 కిలో మీటర్ల మేర పూర్తయింది. కేవలం చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. తొలిదశలో తూర్పు ప్రధాన కాలువ 44.625 కిలోమీటర్ల దూరం వరకు పరిగణనలోకి వస్తుంది. ఇందులో 44.025 కిలో మీటర్ల మేర తవ్వకం పూర్తయింది. 48 కట్టడాల్లో ఇంకా 30 నిర్మించాల్సి ఉంది. అలాగే 952.18 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. రెండవ దశకు రూ. 1,906 కోట్లు: వెలిగొండ రెండవ దశ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని 3,28,300 ఎకరాలకు నీరందించేందుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో నల్లమలసాగర్ జలాశయం నుంచి ప్రారంభమయ్యే తూర్పు ప్రధాన కాలువ కిందే 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 86 కిలోమీటర్ల మేర పొడవున్న ఈ కాలువలో కేవలం 3 కిలోమీటర్ల మేర తవ్వకం మాత్రమే మిగిలి ఉంది. బ్రాంచి కాలువల విషయానికొస్తే, మొత్తం 244 కిలోమీటర్లలో 31 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. అదనంగా ప్రధాన కాలువపై 75 నిర్మాణాలు, బ్రాంచి కాలువలపై 634 కట్టడాల పనులు చేపట్టాల్సి ఉంది. 60,300 ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న పశ్చిమ బ్రాంచి కాలువలో 30 కట్టడాలు పూర్తి కావాల్సి ఉంది.

## 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి :** ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్దతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ఠ స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు.

## మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీలో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

రూ.75లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి మండలం మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీలో రూ.75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతోపాటు ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు సరైన రహదారి సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, రూ.75 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు.రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి కాలనీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ జెడ్పీ చైర్మన్ వాసును కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



**వి.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
పలమనేరు మాజీ ఎమ్మెల్యే,ఇటీవల చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఎన్. వెంకటయ్య గౌడ్ శుక్రవారం వి.కోట మండలం పట్టపల్లి కొత్తూరు గ్రామంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జి. శ్రీనివాసులు (వాసు)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాసు ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. అనంతరం వెంకటయ్య గౌడ్‌ను వాసు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ బాలాజీతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్న కేంద్ర సమాచార కమిషనర్

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**



శ్రీకాళహస్తి న్యూఢిల్లీ కేంద్ర సమాచార కమిషనర్ సుధారాణి రిలంగి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం శ్రీకాళహస్తి శ్రీజ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రోటోకాల్ ఏఈఓ పి. లోకేష్‌బాబు ఆమెకు స్వాగతం పలికి, స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆలయ అధికారులు స్వామివారి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## పూసరపెంట గ్రామానికి సిమెంటు రోడ్డు వేయాలి

**వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు : గ్రామస్తుల ఆవేదన**



**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
పలమనేరు రూరల్ మండలం బయ్యప్పగారి పంచాయతీ పరిధిలోని పూసరపెంట గ్రామానికి సిమెంటు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామంలో సుమారు 30 ఎస్సీ కుటుంబాలు, మరో 10 ఇతర కుటుంబాలు నివసిస్తున్నాయని, ఏళ్లగా రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో తీవ్రఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దొమ్మర పాపమ్మ గుడి నుంచి కోటూరు వరకు సిమెంటు రోడ్డు నిర్మించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే తరహాలో పూసంపెంట గ్రామం నుంచి వడివేలు, వెంకటాచలం ఇళ్ల వరకు సుమారు అర కిలోమీటరు మేర సిమెంటు రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులు గ్రామానికి వచ్చినప్పుడు రోడ్డు వేస్తామని హామీ ఇస్తున్నప్పటికీ, ఆచరణలో నెరవేరడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్య గమనిక

### బాండ్ల వెరిఫికేషన్‌కు ఒరిజినల్ పత్రాలతో హాజరుకావాలి

**ఎస్.ఆర్.పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**



ఎస్.ఆర్.పురం మండలంలోని అగ్రిగోల్డ్ బాధిత డిపాజిటర్లు, ఏజెంట్ల బాండ్ల వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఈ నెల 10వ తేదీ శనివారం చిత్తూరులోని ఎస్పీ కార్యాలయానికి హాజరుకావాలని ఎస్ఐ సుమన్ సూచించారు. శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు చిత్తూరు పీసీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ఎస్పీ కార్యాలయంలో సీఐడీ అధికారులు బాండ్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. బాధితులు తమ ఒరిజినల్ బాండ్‌తో పాటు కలర్ జిరాక్స్ ప్రతిపై సంతకం చేసి సమర్పించాలని సూచించారు. అలాగే ఆధార్,పాన్ కార్డుల జిరాక్స్ ప్రతులపై సంతకాలు చేసి అందజేయాలన్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫొటో, తమ ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా వెంట తీసుకు రావాలని ఎస్ఐ సుమన్ స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని ఆయన సూచించారు.

## వార్డుల పునర్విభజన నిబంధనల మేరకు చేపట్టాలి

**మున్సిపల్ కమిషనర్‌కు వైఎస్సార్సీపీ వినతి**




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా న్యాయబద్ధంగా నిర్వహించాలని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి సూచనల మేరకు వైఎస్సార్సీపీ నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న 35 వార్డులను 44 వార్డులుగా పునర్విభజిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారని, అభ్యంతరాలను ఈ నెల 14వ తేదీలోపు తెలియజేయాలని సూచించారని తెలిపారు. జనాభా ప్రాతిపదికన, భౌగోళిక సరిహద్దులను పరిగణనలోకి తీసుకుని ప్రతి వార్డులో ఓటర్ల సంఖ్య సమతుల్యంగా ఉండేలా విభజన చేపట్టాలని కోరారు.రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వైఎస్సార్సీపీ బలంగా ఉన్న ప్రాంతాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల ఓట్లను చెల్లాచెదురు చేసేలా విభజన చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. వార్డుల తుది జాబితాను పరిశీలించిన అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పార్టీ తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆర్కాట ముత్తు, మహబూబ్ బాషా, ఉత్తరాది శరవణకుమార్, కంట ఉదయ్‌కుమార్, పసలసుమతితో పాటుపలువురు వైఎస్సార్సీపీ నాయకులు, పాల్గొన్నారు.

## బి.ఆర్.డి. ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**రాళ్లబూదుగూరు పీహెచ్‌సీలో 67 మందికి వైద్య పరీక్షలు**



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
కుప్పంలోని బి.ఆర్.డి. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాళ్లబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బి.ఆర్.డి. ఆసుపత్రికి చెందిన వైద్య బృందం జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, జనరల్ సర్జరీ విభాగాల్లో రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ శిబిరంలో సుమారు 67 మంది పాల్గొని వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బి.ఆర్. సురేష్ బాబుతో పాటు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివకుమారి, డాక్టర్‌ఉషారాణి, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తపల్లిమిట్టలో తాగునీటి సమస్యకు పరిష్కారం

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 09:**



ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లిమిట్ట గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో నూతన బోరు ఏర్పాటు చేసి, మోటారు బిగించి పైపులైన్ ద్వారా తాగునీరు అందుబాటులోకి తెచ్చినట్లు ఎంపీడీవో వనజ తెలిపారు. గ్రామానికి తక్షణమే బోరు, మోటారు, పైపులైన్ మంజూరు చేసిన ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు దాసరి జీవన్ కుమార్, సూరిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఢిల్లయ్య, పంచాయతీ కార్యదర్శి గీత, ఏఈ ముని తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలకు అన్ని సహాయ సహకారాలు అందిస్తాం

**ఎమ్మెల్యే డాక్టర్ థామస్..**

**వీఎం కన్స్ట్రక్షన్స్ ప్రసన్నకుమార్ సేవలు అభినందనీయం**

**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 09:**



గంగాధరనెల్లూరు మండలం సర్విరెడ్డిపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ హామీ ఇచ్చారు. శుక్రవారం పాఠశాలలో నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్లాంట్ ఏర్పాటు చేసిన వీఎం కన్స్ట్రక్షన్స్ అధినేత ప్రసన్న కుమార్ సేవలను అభినందించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సమావేశ మందిరం వద్ద రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తామని ప్రసన్నకుమార్ హామీ ఇచ్చారు. పాఠశాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే ఎంపీడీవోకు సూచించడంతో పాటు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు ఆటో అందిస్తామని తెలిపారు. కరాటేలో సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థినిని సన్మానిం చారు. పాఠశాలకు ఫ్రిజ్ అందించిన పాలసముద్రం మాజీ ఎంపీపీ ఇందిరమ్మ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వామిదాస్, జనసేన ఇన్ చార్జి యుగంధర్ సోదరుడు ఆదాం, నాయకులు మురుగేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తరుగు పూర్ణిమ బాబు, ఎస్ఆర్ పురం సహకార సంఘ డైరెక్టర్ నాగరాజ్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలి

**22 అంశాలకు నోడల్ అధికారుల నియామకం: డీఆర్వో మోహన్ కుమార్**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, పురపాలక ఎన్నికల నిర్వహణకు అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కే. మోహన్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి 22 అంశాలకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి మౌలిక వసతులు కల్పించాలని, స్ట్రాంగ్ రూమ్‌లు, పంపిణీ, స్వీకరణ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ముందుగానే గుర్తించి పరిశీలించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి సిద్ధం చేయడంతో పాటు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సున్నిత, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, ఎన్నికల అధికారులు, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారవ్యయం, ర్యాలీలు, సమావేశాల పర్యవేక్షణతో పాటు ఎన్నికల సమాచార నిర్వహణ, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లాలో 622 గ్రామ పంచాయతీలు,27జడ్పీటీసీ,370 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు నివేదికలు సమర్పించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్ బాబు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాలో వినియోగదారులకు ఇబ్బందులు కలగకూడదు

**గ్యాస్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలి : జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 09:**
జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా, పంపిణీలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ల లభ్యత, బుకింగ్‌లకు అనుగుణంగా సకాలంలో డెలివరీ, నిల్వల వివరాలను సమీక్షించారు. సిలిండర్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని, వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, డెలివరీ సిబ్బంది వినియోగదారులతో మర్యాదగా వ్యవహరించేలా చూడాలని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ, ఇతర సందేహాలపై వినియోగదారులకు సరైన సమాచారం అందించాలని స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా పనితీరును మెరుగుపరచడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్ల విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎల్.వెంకటరాముడు, సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలి

**అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి**



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆకాంక్షించారు. శ్రీకాళహస్తిలోని ఆర్‌పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రదర్శనను తిలకించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేలా ప్రదర్శన ఏర్పాటు చేసిన ఇస్రో, షార్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో నీటి సంరక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ, ఎల్‌నినో కారణంగా సంభవించే పర్యావరణ మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.., ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by K.L.Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K L KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143, Cell : 9440815774